# కానుకలొచ్చేశాయ్

- స్టాక్ పాయింట్లలో పంపిణీకి సిద్ధం
- తరగతుల వారీగా విభజన
- జిల్లాలో 1.43 లక్షల మందికి ప్రయోజనం

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** బడి తెరచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో గుర్తించిన స్టాక్ పాయింట్లలో ఇప్పటికే వీటిని నిల్వ చేసి ఆయా పాఠశాలలకు తరలించే ఏర్పాటు చురుగ్గా సాగుతున్నాయి. జగనన్న విద్యాకానుక ద్వారా కొత్తగా అడ్మిషన్లు పొందిన వారికి సైతం తొలి రోజే వీటిని అందజేసేందుకు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మందికి పంపిణీ చేయాలనే ముందస్తు అంచనాలతో అధికారులు సమాయత్తమవుతున్నారు

**8 వస్తువులతో కిట్లు**

ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థి చదువుకు అవసరమయ్యే అన్ని రకాల సామగ్రిని ఉచితంగా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఒకొక్క కిట్‌లో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇంగ్లిష్ డిక్షనరీ, ఒక బెల్ట్, షూస్, రెండు జతల సాక్స్‌లను జగనన్న కానుకగా విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు 1,43,318 నోట్‌పుస్తకాలు, 1,85,87 బెల్టులు, 1,59,295 షూస్, 1,59,797 స్కూల్ బ్యాగ్‌లు, 1,59,797 యూనిఫాం, 1,21,0436 పాఠ్య పుస్తకాలు, 1,78,257 వర్క్స్ బుక్స్, 6,826 డిక్షనరీలు, 17,309 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు చేరాయి.


మండల కేంద్రంలో అన్ని వస్తువులు కిట్‌గా తయారుచేస్తున్న సిబ్బంది


గోదాముల్లో పుస్తకాలను మండల కేంద్రాలకు తరలిస్తున్న సిబ్బంది

**ముందుగానే నాణ్యత తనిఖీ**

జిల్లా వ్యాప్తంగా 21 మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్ర గోదాము నుంచి మండల స్థాయి స్టాక్ పాయింట్లకు పంపిణీ చేసి అక్కడ నుంచి పాఠశాలలకు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠ్య పుస్తకాలు వంద శాతం సరఫరా చేయగా, మిగిలిన వస్తువులు 80 శాతం వరకూ అందుబాటులో ఉన్నాయి. సీఆర్పీ పరిశీలించి వాటిని సక్రమంగా పాఠశాలలకు చేరేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**పరిశీలన తరువాత పంపిణీ..**

మండల కేంద్రాల్లో అన్ని వస్తువులు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత కిట్‌గా తయారు చేసి పాఠశాలలకు పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు తెరచేనాటికి పంపిణీ చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.
– చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ, సమగ్రశిక్ష అభియాన్



# ప్రజలకు బాసటగా పథకాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- కూరాడలో గడప గడపకూ


కూరాడలో లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కరప:** ప్రజాభ్యుదయమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్న పథకాలు, ఇతర సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీనవర్గాల వారికి బాసటగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కూరాడలో మూడోరోజు శనివారం స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటా లబ్ధిదారులు ఎంత ప్రయోజనం పొందారో వివరించారు. సర్పంచ్ వాసంశెట్టి కొండ, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి, బాలాజీ దంపతులు, వెలుగుబంట్ల నారయ్య తదితరులతో పర్యటిస్తూ ప్రతి కుటుంబానికీ ప్రయోజనం చేకూర్చి, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు 32 పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కన్నబాబు కోరారు. చంద్రబాబులా మోసం చేసే మనిషి సీఎం జగన్ కాదని, చెప్పారంటే చేస్తారంతే అన్నారు. అర్హత ఉండి పథకం రానివారు వలంటీర్ ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో రోడ్లు, డ్రైన్లు కావాలని ప్రజలు కోరగా త్వరలోనే వాటిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్, పార్టీనాయకులు మద్దూరి భాస్కర్, చింతా బుజ్జి, రొక్కాల తారకేష్, మారెళ్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు

**కాకినాడ రూరల్:** కరప మండలంలోని మత్స్యకార గ్రామం ఉప్పలంకకు చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆ గ్రామ సర్పంచ్ బొమ్మిడి నమోమి, సతీష్ దంపతుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన ఉంచి సుమారు 100 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు. నాలుగేళ్ళ కాలంలో జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించడంతో ఆయనపై అభిమానంతో ఈ పార్టీలో చేరుతున్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బొమ్మిడి శ్రీనివాస్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణాల పరిశీలన**

మండలంలోని నేమాం గ్రామంలో వైఎస్ జగన్మోహనపురం కాలనీలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, మిల్క్ కలెక్షన్ సెంటర్ తదితర భవనాల నిర్మాణాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం పరిశీలించారు. సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు భవన నిర్మాణాల పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.

## క్లుప్తంగా

### శుద్ధి చేసిన తాగునీటినే అందిస్తున్నాం

- కమిషనర్ మహేష్‌కుమార్

**కాకినాడ సిటీ:** నగర ప్రజలకు రోజుకు 50 ఎంఎల్ శుద్ధి చేసిన తాగునీటిని విక్టోరియా వాటర్ వర్క్స్, శశికాంత్‌నగర్ వాటర్ వర్క్స్ నుంచి 22 రిజర్వాయర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఇరిగేషన్ విభాగం ఏప్రిల్ 25వ తేదీ నుంచి కాలువలు మూసివేసే సమయానికి అరట్లకట్ట ఎస్ఎస్ ట్యాంకు 1582 ఎంఎల్, సామర్లకోట ఎస్ఎస్ ట్యాంకులో 1232 ఎంఎల్ నీటిని పూర్తి సామర్థ్యంతో నిల్వ చేసినట్లు తెలిపారు. ఈ నిల్వలు 40 రోజులకు సరిపోతాయన్నారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేయనున్నట్టు ఇరిగేషన్ అధికారులు చెప్పినట్లు తెలిపారు. వినియోగంలో ఉన్న రెండు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధిచేసి అన్ని విధాలుగా ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. వారం రోజులుగా అన్ని ప్రాంతాల్లో సుమారు 800 నమూనాలను పరిశీలించిన తరువాతే నీటిని అందజేస్తున్నామని తెలిపారు. నీరు అవసరమైన వారు 9849906509 నంబర్‌కు ఫోన్ చేస్తే ట్యాంకరుతో సరఫరా చేస్తామన్నారు.

**విద్యుత్ స్తంభాల మార్పులపై సమీక్ష**

నగరంలో విద్యుత్ స్తంభాల మార్పు, దెబ్బతిన్న స్తంభాల తొలగింపుపై నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ ఆశాఖ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ ప్రక్రియలో భాగంగా చెట్ల నరికివేత, కొత్త చెట్ల పెంపకంపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో ఏడీసీ నాగనరసింహారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఇఇ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

### నిత్యావసరాల వితరణ


బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

**కరప:** స్వచ్ఛంద సేవా సంస్థల వితరణతో బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు సమకూరాయి. కరపలోని నీలయ్యతోటవీధికి చెందిన తోట రాంబాబు కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకుని, బయటకు వెళ్లలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు చెప్పారు. చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ, కాకినాడ మైత్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్నాసుల శివకుమార్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. చేయూత సంస్థ ప్రతినిధి పవన్, మైత్రి లయన్స్ క్లబ్ సభ్యుడు, మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజు, మాజీ సర్పంచ్ తాతీలు పాల్గొన్నారు.

### మాతా రమాబాయి విగ్రహావిష్కరణ

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాయుడుపాలెంలో బాబా సాహెబ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం పక్కనే రమబాయి విగ్రహాన్ని అంబేడ్కర్, తొలి తెలుగు చలన చిత్ర నిర్మాత నెల్లూరుకు చెందిన డాక్టర్ పి.పద్మావతి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

### జేఎన్‌టీయూకే అభివృద్ధిలో అప్పారావు పాత్ర కీలకం


డాక్టర్ అల్లం అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరాజు

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** జేఎన్‌టీయూకే అభివృద్ధిలో వర్సిటీ తొలి వీసీ డాక్టర్ అల్లం అప్పారావు పాత్ర ఎనలేనిదని వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. ఇటీవలే అమెరికాలో మృతి చెందిన అల్లం అప్పారావు సంతాపసభ శనివారం వర్సిటీలో నిర్వహించారు. ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా యునివర్సిటీ సీఎస్ఈ విభాగాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా కీలక బాధ్యతలు నిర్వహించి జేఎన్‌టీయూకే మొదటి వీసీగా నియమితులై నూతన సంస్కరణలు చేపట్టారన్నారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### క్రీడా ప్రతిభకు రోటరీ అండ

**బోట్‌క్లబ్:** ప్రతిభ ఉన్న క్రీడాకారులకు రోటరీ సంస్థ అండగా ఉంటుందని రోటరీ క్లబ్ యూత్ సర్వీసెస్ చైర్మన్ టీవీ రమణారావు అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో యూత్ సర్వీసెస్ మంత్ ముగింపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందించారు. అన్నంరాజు మాణిక్యాంబ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె లక్కరాజు కస్తూరి రూ.20 వేలు విలువచేసే హాకీ స్టిక్, బాల్స్, షూస్ అందించారు. క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, రోటరీ మాజీ గవర్నర్ ఆంజనేయ మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమం

- ఎంపీపీ శ్రీలక్ష్మి
- కరప మండల సమావేశం

**కరప:** మండలాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సహకారంతో అభివృద్ధి చేయడంతో పాటు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడానికే ప్రాధాన్యమిస్తున్నట్టు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ కర్రె స్వప్నతో కలసి ఏఓ గుత్తుల భీమశంకరరావు వివిధ శాఖల వారీగా సమీక్షించారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చురుగ్గా సాగుతోందని, ఈ నెల 30వ తేదీ లోగా మొదటి విడతగా రూ.5500 వంతున 8792 మందికి రూ.4.83 కోట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. డ్రైన్ల ఏఈఈ కె.కీర్తి మాట్లాడుతూ డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగింపునకు రూ.41 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ.29 లక్షలు మంజూరయ్యాయన్నారు. కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణ పనులు మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే ప్రక్రియ నడుస్తోందన్నారు. పశుసంవర్ధకశాఖ కరప సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఎన్‌జే సురేష్‌బాబు మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ పథకానికి పాడి రైతులను గుర్తించేందుకు సర్వే సాగుతోందన్నారు. సామూహిక రక్షిత పథకం ద్వారా మరింత సమయం నీరు వదలాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కోరారు.

**తీర్మానాలు**

మండలపరిధిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవననిర్మాణాలకు రూ 8.73 లక్షలు, జి.భావారంలో కమ్యూనిటీ హాలుకు రూ.20.50 లక్షలు, పెదకొత్తూరులో పాఠశాల ప్రహరీకి రూ.4 లక్షలు, కరపలో సీసీ డ్రైన్లు నిర్మాణానికి రూ.10 లక్షల వంతున 15వ ఆర్థికసంఘం నిధులు కేటాయిస్తున్నట్టు తీర్మానించారు. విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్, ఏపీఓ జి.వెంకటరమణ, సీడీపీఓ జీవీ రమణ పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం


అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి

**కాకినాడ సిటీ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం నిస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కాకినాడ రేచర్లపేట రైతుబజార్ సమీపంలోని మసీదు వద్ద రూ.1.5 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన ఉర్దూఘర్, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్ల వల్ల ఎంతో మంది ముస్లింలు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఆయన తనయుడు జగన్ కూడా ముస్లిం మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా బలపడేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రికి ప్రజలంతా అండగా నిలవాలని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. టీడీపీ, జనసేన వంటి పార్టీల తప్పుడు వాగ్దానాలను నమ్మి మోస పోవద్దని ఎమ్మెల్యే కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మైనార్టీ సెల్ ప్రాంతీయ పరిశీలకులు అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి ఎండీ అజ్ఘర్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బాషా, మాజీ కార్పొరేటర్లు సిగల మధు, రోకళ్ల సత్యనారాయణ, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా వేళంగి క్రికెట్ టోర్నీ


వేళంగిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న కార్యదర్శి చక్రపాణి

**కరప:** మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో శనివారం ఐదు మాచ్‌లు జరిగాయి. నో ఏజ్ లిమిట్ విభాగంలో నాలుగు మ్యాచ్‌లు మొదటిమ్యాచ్‌లో చినకొత్తూరు జట్టుపై పాతర్లగడ్డ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సుదీర్ (పాతర్లగడ్డ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో పందలపాకజట్టుపై పేపకాయలపాలెం జట్టు గెలవగా వరప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. మూడో మ్యాచ్‌లో మాలపాడు జట్టుపై చొల్లంగిపేట జట్టు గెలిచింది. సుభాష్(మాలపాడు) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాధించాడు. నాలుగోమ్యాచ్‌లో విజయరాయుడుపాలెం జట్టుపై పెనుగుదురు జట్టు గెలిచింది. రోహిత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. అండర్–19 విభాగంలో జగన్నాథగిరి జట్టుపై భావారం గెలవగా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బన్నీ నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను తూరంగి గ్రామ కార్యదర్శి ముమ్మిడి చక్రపాణి, గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులతో కలసి అందజేశారు.

# నగర పరిధిలో సమగ్ర సర్వే చేయండి

- కమిషనర్ మహేష్‌కుమార్

**కాకినాడ సిటీ:** నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఆయన స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎన్ని ఇళ్లు, ఎన్ని కుటుంబాలు, ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి? సదరు నివాసం అసెస్మెంట్ పరిధిలో ఉందా? లేదా? యూజర్ చార్జీలు చెల్లిస్తున్నారా లేదా వంటి సమాచారంతో సర్వే చేయాలన్నారు. నోడల్ అధికారులు స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. నిర్ణీత పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఏడీసీ సిహెచ్ నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

### దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో పాల్గొన్న మందకృష్ణ మాదిగ

**కాకినాడ సిటీ:** రాష్ట్రంలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రూ.2.48 లక్షల విలువైన సరకు జప్తు

**కాకినాడ సిటీ:** నిత్యావసరాల చట్టం–1955 సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేసి విచారించి సీజ్ చేసిన రూ.2.48 లక్షల విలువైన సరుకును శనివారం ప్రభుత్వానికి బదలాయించినట్టు చేసినట్లు జేసీ ఎస్.ఇలక్కియ తెలిపారు. అలాగే పీడీఎస్ అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. పౌర సరఫరాల ఖాతాకు జమవుతాయన్నారు.

### వేసవి శిబిరం తనిఖీ

**కరప:** మండలంలోని వేళంగి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వీఎల్ఎన్ సాయి వరప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులు నేర్చుకున్న కథలను చెప్పించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు, ఖండవల్లి గుణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### యోగి వేమన వర్సిటీ అథ్లెటిక్స్ కోచ్‌గా ప్రవీణ్


కోచ్ ప్రవీణ్, పీడీ రామసుబ్బారెడ్డి

**నాగమల్లితోట జంక్షన్:** యోగి వేమన వర్సిటీ అథ్లెటిక్ జట్టుకు కోచ్‌గా కాకినాడ డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ ప్రవీణ్ ఎంపికయ్యారు. సోమవారం నుంచి 31వ తేదీ వరకు యూపీలో జరిగే ఖేలో ఇండియా–2022 పోటీలలో పాల్గొనే జట్టుతో ప్రవీణ్ హాజరుకానున్నారు. ప్రవీణ్ వద్ద శిక్షణ పొందుతున్న షేక్ మొహియుద్దీన్ హైజంప్ విభాగంలో ఈ పోటీల్లో యోగి వేమన వర్సిటీ తరఫున పాల్గొంటున్నాడు.

### దిశ ఎస్ఓఎస్‌కు ఫిర్యాదుతో యువకుడి పరార్

**కాకినాడ రూరల్:** ప్రేమ పేరిట వేధింపులతో పాటు, ఆ యువతి ఇంటికి వెళ్లి దుర్భాషలాడడమే కాక, అడ్డు వచ్చిన తండ్రిని గాయపరిచిన యువకుడు ఒక్క దిశ ఎస్ఓఎస్ కాల్‌కు పరారయ్యాడు. ఈ సంఘటన సర్పవరం పోస్టల్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. దిశ టీం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్పవరం గ్రామానికి చెందిన వీరబాబు అనే యువకుడు కొన్ని రోజులుగా పోస్టల్ కాలనీకి చెందిన యువతి వెంట పడుతూ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లి అతిగా ప్రవర్తించి ఆమె తండ్రిని గాయపరిచాడు. దీంతో సదరు యువతి దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. వెంటనే అలర్ట్ అయిన దిశ టీమ్‌కు చెందిన కానిస్టేబుల్, హోమ్ గార్డులు ఐదు నిమిషాల వ్యవధిలో బాధితురాలి లోకేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు రాకను కనిపెట్టిన వీరబాబు పారిపోవడంతో బాధిత యువతి ఊపిరిపీల్చుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడు వీరబాబుపై కఠిన చర్యలు తీసుకుంటామని దిశ పోలీసులు తెలిపారు.

### జర్నలిస్టును ఆదుకోవడం అభినందనీయం

**కాకినాడ సిటీ:** కష్టాల్లో ఉన్న సాటి జర్నలిస్టును ఆదుకోవడం అభినందనీయమని జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి డి.నాగార్జున్ అన్నారు. ప్రమాదంలో గాయపడిన ఓ టీవీ కెమెరా మెన్ సప్పా శ్రీనివాస్‌ను శనివారం జర్నలిస్ట్ యూనియన్ నాయకులు అల్లుమల్లు ఏలియా, షేక్ సలీమ్, మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో నాగార్జున పరామర్శించారు. అల్లుమల్లు ఏలియా, షేక్ సలీమ్‌లు సమకూర్చిన రూ.5 వేలు నగదు, 25 కిలోల బియ్యంను నాగార్జున్ ఆయనకు అందజేశారు. బాధితుడి పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

### కందుకూరికి ఘన నివాళి

**కాకినాడ రూరల్:** సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞశాలి కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సాహితీవేత్త డాక్టర్ శిరీష కందుకూరి సంఘ సేవలను వివరించారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద వీరేశలింగం పంతులు విగ్రహానికి ఆమెతో పాటు, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, తురగా సూర్యారావు, అడబాల సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

# అవగాహనే అత్యవసర పరిస్థితిలో రక్ష


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ ఎంఆర్ఎన్ మహేష్

- డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

**కాకినాడ రూరల్:** అవగాహనతోనే అత్యవసర పరిస్థితుల్లో మనల్ని మనం కాపాడుకోవడంతో పాటు ఇరుగుపొరుగు వారిని కాపాడే అవకాశం ఉంటుందని డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి తెలిపారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా మెడికవర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో భానుగుడి వద్ద అవగాహన ర్యాలీ, వైద్యులతో అత్యవసర సరిస్థితుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భద్రత అనేది ప్రతి వ్యక్తితో మొదలయ్యే సమష్టి బాధ్యత అన్నారు. ఈ మధ్య కాలంలో రోడ్డుపై వెళ్తూ, డ్యాన్స్ చేస్తూ, జిమ్ చేస్తూ చనిపోయారంటూ వార్తలు వింటున్నామని, ఎమర్జెన్సీ రెస్పాన్స్, ట్రామా కేర్‌తో స్వీయ రక్షణే కాక, ఎదుటివారినీ రక్షించగలమని అన్నారు. సీపీఆర్ వంటి వాటిని ప్రతి ఒక్కరూ నేర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వైద్యులు జయప్రకాష్, పి.నవీన్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రతి సెకను గణించబడుతుందన్నారు. మనం చేసే సహాయం వల్ల ఒకరి జీవితంతో పాటు వారిపై ఆధారపడిన వారికి మేలు చేస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, ప్రమాదాల సమయంలో నైపుణ్యం, జ్ఞానం, వనరులు కలిగి ఉంటే మొదటి గంట (గోల్డెన్ అవర్)లో చేసే వైద్యం వల్ల చాలా మందిని రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికర్ సెంటర్ హెడ్ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అత్యవసర వైద్యంతో ప్రాణానికి రక్షణ**

**బోట్‌క్లబ్:** గుండెపోటుతో పాటు, పక్షపాతం వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగికి ప్రాథమిక చికిత్స సకాలంలో అందిస్తే బతికే అవకాశాలు చాలా ఎక్కువని ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఆర్ఎన్ మహేష్ అన్నారు. శనివారం అపోలో ఆసుపత్రిలో వరల్డ్ ఎమెర్జెన్సీ మెడిసిన్ డే నిర్వహించారు. గుండె పోటు వచ్చినప్పుడు చాతి దగ్గర నొప్పితో, ఆయాసంతో బాధపడతారని అటువంటి లక్షణాలు కనపడిన వెంటనే మంచి సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. సమయం వృధా అయ్యే కొద్ది గుండెపోటు ప్రాణాంతకం అవుతుందన్నారు. న్యూరో ఫిజిషియన్ శివరామగాంధీ, డాక్టర్ భువనాంజలి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి యూనిట్ సీఈఓ ఐవీ రమణ పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనపై బందోబస్తు పరిశీలన

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** కాకినాడలో ఈ నెల 31న నిర్వహించనున్న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవానికి కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి వర్సిటీ అవరణలోని అతిథి గృహం,స్నాతకోత్సవం నిర్వహించే ఆడిటోరియం తదితర ప్రాంతాలన్నీ పరిశీలించారు. గవర్నర్ భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వర్సిటీ అధికారులకు సూచనలు చేశారు.వ ర్సిటీ రెక్టార్ రమణ,రిజిస్ట్రార్ సుమలతలు వేడుకలు నిర్వహించే ప్రాంతం,గవర్నర్ షెడ్యూల్ తదితర వాటిని వివరించారు.


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్